క్లుప్తంగా

## గవర్నర్‌ను కలిసిన ఆపస్ నాయకులు



గవర్నర్‌కు డైరీ అందజేస్తున్న ఆపస్ నాయకులు

**చిత్తూరు కలెక్టరేట్:** ఆపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిపై సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, బాలాజీ మాట్లాడుతూ.. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2017లో రాష్ట్రపతి గెజిట్ విడుదల చేశారన్నారు. అయితే న్యాయపరమైన వివాదాల కారణంగా అమలుకు నోచుకోలేదన్నారు. అనంతరం గవర్నర్‌కు ఆపస్ సంఘం డైరీని అందజేసినట్లు తెలిపారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

**తవణంపల్లె:** ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని తవణంపల్లె వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మాధవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. 104 మొబైల్ క్లినిక్ ద్వారా గర్భిణులు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 47 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. దోమలు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో జ్వరాలు సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

## శాస్త్రోక్తంగా ఆలయ కుంభాభిషేకం



కొలువుదీరిన ద్రౌపదీ, పాండవుల విగ్రహాలు

**యాదమరి:** మండలంలోని కాశిరాళ్ల గ్రామంలో ఉన్న ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో సోమవారం మహా కుంభాభిషేక పూజలు నిర్వహిచారు. గ్రామంలోని ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు, భక్తులు విరాళాలతో ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కుంభాభిషేకం, కలశ ప్రతిష్ట, ధ్వజస్తంభను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. అనంతరం ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు పూజలు చేసి కొలువుతీర్చారు. సోమవారం నుంచి 18 రోజుల పాటు ఆలయం వద్ద మహాభారత యజ్ఞం, హరికథ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న ఫిరమిడ్ మాస్టర్ అనంతలక్ష్మి, హాజరైన ప్రజలు

**తవణంపల్లె:** ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన సీనియర్ ఫిరమిడ్ మాస్టర్ అనంతలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని సిద్ధంపల్లెలో ఉన్న శ్రీవిఘ్నేశ్వర ఫిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనని తాను తెలుసుకోవడం కోసమే ధ్యానమని సూచించారు. ధ్యానంతో మానసికంగా, శారీరకంగా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక పాల్గొన్నారు.

## 4 నుంచి రాయలసీమ ఆర్గానిక్ మేళా

**తిరుపతి కల్చరల్:** రైతు సాధికార సంస్థ, ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం సంయుక్తంగా ఇస్కాన్ రోడ్డులోని టీటీడీ మైదానంలో ఆగస్టు 4 నుంచి 6వ తేదీ వరకు రాయలసీమ ఆర్గానిక్ మేళా–2023ను నిర్వహించనున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుమారస్వామి తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆర్గానిక్ మేళా కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయానికి ఆదరణ పెరిగిందన్నారు. మార్కెటింగ్ చేసుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్గానిక్ మేళా చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు చేపడతామన్నారు. ఆగస్టు 3వ తేదీ ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి కాంప్లెక్స్ నుంచి టీటీడీ మైదానం వరకు ఆరోగ్య పరుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయ పరిశోధకులు గంగాధరం, నిర్వాహకులు ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

# పక్కాగా ఓటర్ల లెక్క

- వచ్చే నెల 21వ తేదీ వరకు ఓటర్ల సర్వే
- ఇంటింటికీ వెళ్తున్న బీఎల్వోలు
- ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం
- అక్టోబర్ 17న మూసాయిదా జాబితా ప్రచురణ

**చిత్తూరు నియోజకవర్గ ఓటర్ల వివరాలు**

| ప్రాంతం | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | స్త్రీలు | ఇతరులు |
|---|---|---|---|---|
| చిత్తూరు అర్బన్ | 146 | 68919 | 71756 | 38 |
| చిత్తూరు రూరల్ | 32 | 12074 | 12137 | 2 |
| గుడిపాల | 45 | 17546 | 17952 | 5 |
| మొత్తం | 223 | 98539 | 101845 | 45 |



ఓటరు పరిశీలనలో బీఎల్వో, సిబ్బంది

**చిత్తూరు రూరల్:** రాష్ట్రంలో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణపై నియోజకవర్గ యంత్రాంగం దృష్టి సారించింది. ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటు హక్కు కల్పిస్తారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన ఓటు శాతం పరిగణలోకి తీసుకుని ఓటింగ్ శాతం పెరగడానికి, తగ్గడానికి గల కారణాలు ఈ సర్వేలో గుర్తిస్తారు. చిత్తూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణపై బూత్‌లెవల్ అధికారులకు ఇప్పటికే మండల కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలని సూచించారు. చిత్తూరు నియోజకవర్గ ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఆయా మండల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల అధికారులు సహకారం అందిస్తారు. జాబితా సవరణపై ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీల నాయకులకు సైతం అవగాహన కల్పించారు. బీఎల్వోలకు ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో సవరణ వివరాలు నమోదు చేస్తున్నారు. తాజా లెక్కల ప్రకారం నియోజకవర్గంలోని 223 పోలింగ్ కేంద్రాల్లో జూలై 4వ తేదీ నాటికి 1,01,845 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**సర్వేలో పరిశీలించే అంశాలు**

- జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లను గుర్తించి తొలగిస్తారు.
- వందేళ్లు పైబడిన ఓటర్లను గుర్తిస్తారు. చనిపోయిన వారి ఓటు హక్కును తొలగిస్తారు.
- ఇంటి నంబర్ లేకున్నా, ఒకే ఇంటి నంబర్‌లో పది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.
- సర్వీసు ఓటర్లు (మిలటరీ) ఎన్ఆర్ఐ ఓట్ల వివరాలు సరి చేస్తారు.
- దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి ఇష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో అడిగి అక్కడే నమోదు చేస్తారు.
- ఒకే పోలింగ్ కేంద్రంలో 1,500 మందికి పైగా ఓటర్లు ఉంటే కొత్త కేంద్రాన్ని సిఫార్సు చేయడం, పేర్లు, నియోజకవర్గం, చిరునామా, ఫోన్ నంబర్, ఫొటో గుర్తింపు కార్డులో మార్పులు, చేర్పులు, తప్పులు, ఒప్పులు సరిచేస్తారు.
- ఓటర్ల అభ్యర్థన మేరకు అనువుగా పోలింగ్ కేంద్రాలు, ఓట్లు ఒకచోట నుంచి మరో చోటుకి మారుస్తారు.

**ఎన్నికల అధికారుల షెడ్యూల్ ప్రకారం**

- ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారు.
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల సర్దుబాటు, విభజన, పోలింగ్ కేంద్రానికి 1,500 ఓట్లు ఉండేలా సర్దుబాటు చేయడం, ఎక్కువ, తక్కువ ఉంటే సమీప పోలింగ్ కేంద్రాల్లో కలుపుతారు.
- గుర్తింపు కార్డులు, జాబితాలోని తప్పుల సవరణలో భాగంగా స్పష్టత లేని ఫొటోలు గుర్తించి తొలగించడం, అనంతరం ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపడం.
- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు ఫారం–1 నుంచి ఫారం–8 వరకు పరిశీలిస్తారు. అదనంగా పెరిగిన, తగ్గిన ఓటర్ల జాబితా రూపొందించడం.
- అక్టోబర్ 17 ముసాయిదా జాబితా ప్రకటన. దీనిపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ.
- శని ఆదివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం.
- డిసెంబర్ 26వ తేదీ నాటికి ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్లను పరిష్కరించడం. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీన సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను ఆమోదించడం.
- జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రదర్శిస్తారు.

> **ప్రతి ఒక్కరూ సహకరించాలి**
>
> ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి తప్పొప్పులను సరిచేస్తున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరికీ ఓటు హక్కు కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆయా మండలాల తహసీల్దార్లు పర్యవేక్షిస్తారు. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించాం. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి.
>
> –మురళీ మోహన్, తహసీల్దార్, చిత్తూరు

## ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న అధికారులు

**బంగారుపాళెం:** జగనన్న పాలనలో ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలకూరు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పాలేరులో సోమవారం జగనన్న సురక్ష గ్రామ సభను అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. గతంలో సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలలు తరబడి తిరిగేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్నకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ మాట్లాడుతూ.. జగనన్న పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నారన్నారు. అనంతరం గ్రామ సచివాలయం పరిధిలో పలువురు లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, పాలేరు, మొగిలివెంకటగిరి సర్పంచ్‌లు ప్రసాద్‌రెడ్డి, దీప్తిరెడ్డి, మాజీ సర్పంచ్ అరుణామల్‌రెడ్డి పాల్గొన్నారు.

## జాబ్‌మేళా రేపు

**నగరి :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్ మన్ సర్వీసెస్ సెంటర్ చెన్నై సంయుక్తంగా బుధవారం టెలికాలర్ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ చదువుతున్న వారు ఈ ఉద్యోగానికి అర్హులన్నారు. నెలకు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం, ఉచిత వసతి సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్క్ లిస్ట్ జిరాక్స్, ఒరిజినల్ ఐడీ ప్రూఫ్‌తో ఈ నెల 26వ తేదీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు జేకేసీ ఫుల్ టైం మెంటార్ లాల్‌బాషాను గానీ, కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పార్థసారథిని 9884787264 నంబరుకు, కంపెనీ యూనిట్ హెడ్ ధనరాజ్‌ను 9884304026 నంబరులో సంప్రదించాలన్నారు.

## సచివాలయ వ్యవస్థతో ఇంటి ముంగిటకే సేవలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**చిత్తూరు అర్బన్:** సచివాలయ వ్యవస్థతో ప్రజల ఇంటి ముంగిటకే సేవలు అందుతున్నాయని.. ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు అన్నారు. సోమవారం నగరంలోని 11 వార్డు సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు ప్రజలకు సేవ చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక పోతున్నాయన్నారు. జగనన్న సురక్షలో సమస్యలకు సత్వర పరిష్కారం చూపిస్తున్నట్లు తెలిపారు. పలు రకాల సర్టిఫికెట్లు, సేవలను సత్వరం అందజేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, కార్పొరేషన్ ఏసీపీ రామకష్ణుడు, పార్టీ కార్యకర్తలు సయ్యద్, బాలాజీ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల కోసం వినతి



పూతలపట్టు: తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న మహిళలు



బంగారుపాళెంలో ముస్లిం మహిళలు

**బంగారుపాళెం:** తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ మండలంలోని తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీ ముస్లిం మహిళలు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. సమస్యపై స్పందించిన తహసీల్దార్ బెన్నురాజ్ విచారణ చేసి అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రీవెన్స్ డే సందర్భంగా పలువురు రెవెన్యూ సమస్యలపై అర్జీలు సమర్పించారు.

**గువ్వలకాలనీ వాసులు..**

**పూతలపట్టు:** మండలంలోని గువ్వలకాలనీవాసులు ఇంటి పట్టాల కోసం తహసీల్దార్ విజయ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. అలాగే పలువురు రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు.

## ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి

**పాలసముద్రం :** గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పాలసముద్రం మండలం తమిళనాడు సరహద్దులో ఉన్నందున అక్రమంగా ఇసుక, ఎర్రచందనం రవాణా జరిగే అవకాశం ఉందని, అందువల్లపోలీసులు నిఘా పెట్టాలని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు జరిగి పోలీసు కేసులు కాకుండా అన్నదమ్ములుగా కలసి మెలసి ఉండాలని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు తీసుకొచ్చిన వారితో స్నేహభావంతో మెలగి వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా తమిళనాడు సరిహద్దులో ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

## స్పందన వినతులకు సత్వర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

**చిత్తూరు అర్బన్:** స్పందన కార్యక్రమంలో అందే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని నగర కమిషనర్ అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో ఇంజినీరింగ్–3, ప్రధాన కార్యాలయం –1, మెప్మా– 1 సహా ఐదు వినతులు వచ్చాయి. వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేసి పరిష్కరించాలన్నారు. గత వారం అందిన వినతులపై అధికారులతో సమీక్షించారు. స్పందన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ వెంకట ప్రసాద్, ఎంహెచ్వో లోకేష్ ఉన్నారు.

## నవధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు

**ఐరాల:** ఒకే రకమైన పంట కాకుండా, నవధాన్యాల పంటలు సాగు చేయడం వల్ల రైతుకు ఆదాయంతో పాటు నేల సారవంతం అవుతుందని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. సోమవారం మండలంలోని చిగరపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో మహిళలకు నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల పంటలు వేయడం ద్వారా ఒక పంటలో నష్టం వచ్చినా మరో పంట నుంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. మామిడి, వేరుశనగ అంతర పంటల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. మామిడిలో నవధాన్యాల పద్ధతిలో 33 రకాల విత్తనాలు సాగు గురించి చెప్పారు. అంతర పంటల ప్రయోజనాలు, దిగుబడి, మార్కెటింగ్ అవకాశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు విజయకుమారి, సర్పంచ్ స్వప్న పాల్గొన్నారు.

## స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి మండలం తొండవాడ బ్రిడ్జి వద్ద స్కూటర్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. తొండవాడకు చెందిన శ్రీను తిరుపతికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. తొండవాడ వద్ద వేగంగా వచ్చిన ట్రాక్టర్ స్కూటర్‌ను ఢీకొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో గాయపడిన శ్రీనును చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడిపై కేసు నమోదు

**వరదయ్యపాళెం:** మద్యం మత్తులో ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు అత్యాచారానికి ప్రయత్నించిన యువకుడిపై కేసు నమోదైనట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గోవర్ధనపురానికి చెందిన ప్రశాంత్ (29) అదే గ్రామానికి చెందిన ఓ మహిళ (49) ఈ నెల 22వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఆమె ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అనంతరం అత్యాచారానికి ప్రయత్నించడంతో ఒక్కసారిగా ఆమె కేకలు పెట్టడంతో ప్రశాంత్ పరారయ్యాడు. ఈ ఘటనపై బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి సోమవారం కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న యువకుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్ఐ పేర్కొన్నాడు.

## జీఐఎస్ సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై

**చిత్తూరు కార్పొరేషన్:** విద్యుత్‌శాఖ ఆస్తుల గణన కోసం చేస్తున్న జీఐఎస్ (జియోలాజికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) సర్వేను వేగవంతం చేయాలని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై అన్నారు. సోమవారం రూరల్–2 డీఈ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరికరాల వివరాలు మ్యానువల్‌గా మాత్రమే ఉందన్నారు. ప్రతి సెక్షన్ పరిధిలో వ్యవసాయ సర్వీసులు ఎన్ని ఉన్నాయి.. ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఉన్నాయి..? లైన్లు ఎక్కడి నుంచి ఎక్కడ వరకు ఉంది అనే అంశాలను సర్వే చేసి స్టిక్కర్లు అతికించి నమోదు చేస్తున్నామని తెలిపారు. వీటిని ఆన్‌లైన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు సమస్య ఏర్పడితే ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. వీటితో పాటు ఎక్కడ సరఫరా కోసం లైన్, పరికరాలు అవసరమో తెలుస్తాయన్నారు. పెండింగ్‌లోని వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయాలన్నారు. ప్రతి సెక్షన్ పరిధిలో డిజిటల్ చెల్లింపులు పెంచి, వందశాతం బకాయిలు వసూలుకు కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం తేలికపాటి వర్షాలు కురుస్తుండడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే సకాలంలో మరమ్మతు పనులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ జ్ఞానేశ్వర్, శేషాద్రి, ఏఈలు రాజా, నీరజా పాల్గొన్నారు.

## ఘనంగా విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు



గుడిపాలలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి

**గుడిపాల:** మండలంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. విజయానందరెడ్డికి క్రేన్ సాయంతో భారీ పూలమాలను వేశారు. పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జెడ్పీవైస్ చైర్మన్ రమ్య ఆధ్వర్యంలో వెయ్యి మందికి చీరలను పంపిణీ చేశారు. నరహరిపేట హైస్కూల్‌లోని విద్యార్థులు 500 మందికి, సభకు వచ్చిన వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసుదన్‌రెడ్డి, ప్రకాష్, మధుసుదన్‌రాయల్, రాజా, హరిప్రసాద్, చిట్టిబాబు, రమేష్, వెంకిరెడ్డి, కలైఅరసి, మొగిలిరెడ్డి, నవీన్, రవి పాల్గొన్నారు.

## అరణ్యపర్వ పారాయణం ప్రారంభం

**తిరుమల:** తిరుమల నాదనీరాజనం వేదికపై జరుగుతున్న మహాభారత ప్రవచనాల్లో భాగంగా సోమవారం రాత్రి అరణ్యపర్వ పారాయణం ప్రారంభమైంది. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు పవన కుమార శర్మ ప్రవచనం వినిపించగా, అతిథి అధ్యాపకులు డాక్టర్ భరద్వాజ శర్మ శ్లోకపారాయణం చేశారు. ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకురాలు కె.వందన శ్రీకృష్ణ సంకీర్తనలను రాగయుక్తంగా గానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రతిరోజూ రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కేఎస్ఎస్.అవధాని తదితరులు పాల్గొన్నారు.